సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

జిల్లాలో భారీ వర్షం


ఉధృతంగా ప్రవహిస్తున్న తర్నం వాగు

కైలాస్‌నగర్/సాత్నాల: ఆదిలాబాద్ జి ల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి గురువారం వేకువజామున ఐదు గంటల వర కు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 1043.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల నీ టిని విడుదల చేయడంతో తర్నం వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా అక్కడి తాత్కాలిక వంతె పై నుంచి రాకపోకలను నిలిపివేశారు. అత్యధికంగా బేల మండలంలో 57 మిల్లీమీటర్లు, నార్నూర్‌లో 46, ఆదిలాబాద్‌లో 42, గాదిగూడలో 36.3, జైనథ్‌లో 15, ఉట్నూర్‌లో 11.5, భోరజ్‌లో 7.5, ఆది లాబాద్ రూరల్‌లో 4.5, సిరికొండలో 2, మావల, సోనాలలో .5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

15న కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సబ్‌జూనియర్ జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘుపతి, రాష్ట్రపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్ లో 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. 16 సంవత్సరాల లోపు బాలురు, బాలికలు 55 కేజీల బరువు ఉండి ఆధార్ కార్డు, పాఠశాల బోనాఫైడ్ సర్టిఫికెట్, రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజుతో జంజర్ల సాయికుమార్‌కు రిపోర్ట్ చేయాలని, పూర్తి వివరాలకు 7702035200 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆ అధికారి సెక్షన్ మార్పు

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించారు. 'రిమ్స్‌లో వసూల్ రాణి' శీర్షికన గురువారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో సదరు అధికారిని సంబంధిత సెక్షన్ నుంచి తప్పించారు. డిప్యూటీ నర్సింగ్ సూపరింటిండెంట్ గ్రేడ్–2గా పనిచేస్తున్న పి.రమాదేవికి ఆ సెక్షన్ బాధ్యతలు అప్పగించారు.

13న జోనల్ స్థాయి ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 14, 17 సంవత్సరాల బాలబాలికలకు జోనల్‌స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పాఠశాలల నుంచి బర్త్ సర్టిఫికెట్, ప్రస్తుతం చదువుతున్న బోనాఫైడ్, గత సంవత్సరం ప్రోగ్రెస్ కార్డ్ కాపీతో పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్‌కు రిపోర్ట్ చేయాలని, వివరాలకు 77020 35200 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి'

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఉట్నూర్ ప్రాజెక్ట్ మహాసభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.సురేందర్, మడవి నాగోరావ్, రత్నమాల, ముక్త పాల్గొన్నారు.

యూరియా పాట్లు


జైనథ్ మండల కేంద్రానికి చెందిన ఈ రైతు పేరు సుభాష్. 11 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట ఎదుగుదల కోసం యూరియా ఇవ్వాల్సి ఉంది. 20 బస్తాలు కావాలని గురువారం ఉదయం 6 గంటలకే జైనథ్ సహకార సంఘం కార్యాలయానికి వచ్చి లైన్‌లో నిల్చున్నాడు. పట్టాపాస్ పుస్తకానికి రెండు బస్తాల యూరియా మాత్రమే ఇవ్వడంతో అవి సరిపోవని చెప్పడంతో నానో యూరియా లిక్విడ్ బాటిళ్లు ఇచ్చారు. ఇంకా బస్తాలు కావాలని అడిగితే స్టాక్ వచ్చేది ఉందని చెప్పారు. దీంతో నిరాశగా వెనుదిరిగాడు.


సిరికొండ మండలంలోని ఫకీర్‌నాయక్ తండాకు చెందిన ఈ రైతు పేరు జాదవ్ రవీందర్. తన కున్న ఐదెకరాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేశాడు. వర్షాలు కురుస్తుండడంతో పంటకు నష్టం చేకూరింది. ఎదుగుదల కోసం ప్రస్తుతం యూరియా సంపూర్ణంగా వేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఏడు బ్యాగులే లభించడంతో రెండు పర్యాయాలు యూరియా అందించాడు. ప్రస్తుతం యూరియా దొరకకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాడు. పంట పరిస్థితిపై దిగాలు చెందుతున్నాడు.


జైనథ్ సొసైటీ కార్యాలయం ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు

జైనథ్: మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయానికి గురువారం యూరియా స్టాక్ వచ్చిందని తెలియగానే 300ల మందికి పైగా రైతులు వేకువజామునే వచ్చి క్యూలో గంటల తరబడి నిరీక్షించారు. 444 బ్యాగులు రావడంతో పట్టా పాసు పుస్తకానికి రెండు చొప్పున 222 మంది రైతులకు పంపిణీ చేయగా మిగతావారు నిరాశతో వెనుదిరిగారు.

- సరిపడా లభించక రైతుల అవస్థలు
- సొసైటీ కేంద్రాల వద్ద బారులు
- స్టాక్ వచ్చేదుందని చెబుతున్న అధికారులు

యూరియా వివరాలు..
వానకాలం సీజన్‌కు అవసరమైంది : 36 వేల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు వచ్చింది : 29,623 మెట్రిక్ టన్నులు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో యూరియా కొరత మళ్లీ మొదలైంది. గత జూలైలో కొన్ని మండలాల్లో యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత సరిపడా యూరియా రావడంతో సమస్య తీరింది. అయితే తాజాగా మళ్లీ సొసైటీల్లో యూరియా దొరకకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని సొసైటీల్లో ఇదే పరిస్థితి కనబడుతోంది. దీంతో పలుచోట్ల రైతులు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట బారులు తీరుతున్నారు. అయితే వారికి పట్టాపాస్ బుక్‌పై ఒకట్రెండు బ్యాగులు మాత్రమే ఇస్తుండడంతో రైతులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. పెద్ద విస్తీర్ణంలో పంట ఉన్నవారు మొత్తం పంటకు ఈ యూరియా ఏమేరకు సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఆర్పీ కూడా వినియోగం..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రైల్వే లైన్ ఉండడంతో ఇక్కడ రేక్‌పాయింట్ ఏర్పాటు ఉంది. దీంతో ప్రభుత్వం నుంచి సరఫరా చేసే యూరియా ఇక్కడి రేక్ పాయింట్‌కు చేరుకుంటుంది. స్టాక్ వచ్చిన ప్రతీసారి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలకు కూడా ఇక్కడి రేక్‌పాయింట్ నుంచే పంపిణీ చేస్తారు. ఇదిలా ఉంటే.. ప్రతీసారి వచ్చిన స్టాక్‌లో కమిషనర్ రిజర్వు పుల్ (సీఆర్పీ) కోటా ఉంటుంది. గత జూలైలో జిల్లాలో తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వ్యవసాయ శాఖ కమిషనర్‌ను సంప్రదించి సీఆర్పీ కోటాలోని యూరియా వినియోగం కోసం అనుమతి తీసుకున్నారు. అలా ఆ కోటాలోని సుమారు 4,500 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లా రైతుల కోసం వినియోగించారు. అప్పటి నుంచి సమస్య తీవ్రత తగ్గింది. తాజాగా మళ్లీ యూరియా కొరత జిల్లాలో కనిపిస్తోంది. మరోవైపు ప్రస్తుతం సీఆర్పీ కోటాలో సుమారు వంద మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే స్టాక్ ప్రస్తుతం వచ్చేది ఉందని, వర్షాలు, వరదల కారణంగా రావడంలో ఆలస్యం జరిగిందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. కొరత లేదని స్పష్టం చేస్తున్నారు.

నానో యూరియా వినియోగించాలి..


యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను కూడా రైతులు వినియోగించాలి. దీనిపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం మొక్కల ఎదుగుదలకు యూరియా, పొటాషియం కలిపి ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా పూత, కాత దశలో పంట ఎదుగుదలకు తోడ్పడుతుంది.

– డాక్టర్ మోహన్‌దాస్, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్

స్టాక్ వచ్చేది ఉంది..


జిల్లాలో యూరియా కొరత లేదు. ప్రస్తుతం స్టాక్ వచ్చేది ఉంది. రైతులు అవసరం మేర తీసుకుంటే సమస్య ఏర్పడే పరిస్థితి ఉండదు. అంతకుమించి అదనంగా అడగడంతోనే సమస్యలు వస్తున్నాయి. అయినప్పటికీ జిల్లాకు స్టాక్ వచ్చేది ఉంది.

– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పత్రికా స్వేచ్ఛపై 'కూటమి' కుట్ర

- జర్నలిస్టు సంఘాల ఖండన



పాతమంచిర్యాల: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి సర్కార్ భయానక పరిస్థితులు సృష్టిస్తూ పత్రికా స్వేచ్ఛను హరించే కుట్ర చేస్తోందని జర్నలిస్టు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రశ్నించే గొంతుకలపై భౌతికదాడులతోపాటు పోలీసు కేసులతో తీవ్ర అణచివేతకు గురి చేస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్న పార్టీలు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో చేస్తున్న జాప్యం, మోసాలపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు, కార్మికులు, మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల పక్షాన వార్తల రూపంలో ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై కొందరు ప్రభుత్వ ఉద్యోగులతో ఫిర్యాదులు ఇప్పిస్తూ కేసులు నమోదు చేస్తుండడాన్ని తప్పుబట్టారు. తాజాగా ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏర్పాటు చేసే ప్రెస్ కాన్ఫరెన్స్ వార్తలు రాసిన సందర్భంలోనూ సాక్షి దినపత్రికతోపాటు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తూ రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకునే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఇళ్లలో తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ పత్రికాస్వేచ్ఛను హరిస్తూ, ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతులను నొక్కేస్తున్న అప్రజాస్వామిక చర్యలను జర్నలిస్టు, ప్రజాసంఘాల నాయకులు సర్వత్రా వ్యతిరేకిస్తున్నారు. అభిప్రాయాలు వారి మాటల్లోనే..

జర్నలిస్టుల గొంతునొక్కొద్దు


ఆదిలాబాద్‌టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి దినపత్రికపై ఆ ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ సరికాదు. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధంగా ఈ చర్యలు ఉన్నాయి. జర్నలిస్టుల ఇళ్లలో తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు. ప్రజలపక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతును నొక్కేయాలని చూడడం సరికాదు.

– నూకల దేవేందర్, ఆదిలాబాద్ జర్నలిస్ట్ జేఏసీ కన్వీనర్

దాడులు సరికాదు


ఆదిలాబాద్‌టౌన్: ప్రజాస్వామ్యంలో మూలస్తంభమైన పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం సరికాదు. ఇలాంటి చర్యలతో పత్రిక స్వేచ్ఛను హరించడం సమంజసం కాదు. భావప్రకటన స్వేచ్ఛను హరించేలా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నాం.

– మెడపట్ల సురేశ్, టీడబ్ల్యూజేఎఫ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు

తప్పుడు కేసులతో అణచివేయొద్దు


ఆదిలాబాద్‌టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా సాక్షి తెలుగు దినపత్రికకు సంబంధించిన జర్నలిస్టులపై తప్పుడు కేసులతో అణచివేయాలని చూడడం సరికాదు. వివిధ అంశాలపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏర్పాటు చేసే ప్రెస్‌కాన్ఫరెన్స్‌ల వార్తలు రాసిన సందర్భంలోనూ ఎడిటర్‌తోపాటు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం చోద్యం. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు సరికాదు.

– బేత రమేశ్, టీయూడబ్ల్యూజే (143హెచ్), ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు

దాడి సరికాదు


నిర్మల్: ప్రజాస్వామ్య దేశంలో ప్రతికలపై దాడి ఏమాత్రం సరికాదు. పత్రికాస్వేచ్ఛను కాపాడే బాధ్యతను తీసుకోవాల్సిన ప్రభుత్వాలు పాత్రికేయులపైనే కేసులు పెట్టడాన్ని ఖండించాల్సిందే. నాయకులు మాట్లాడిన మాటలకు 'సాక్షి' ఎడిటర్‌పై కేసు పెట్టడం సరికాదు.

– రితేశ్ రాథోడ్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

స్వేచ్ఛను హరించడమే..


నిర్మల్: సాక్షి దినపత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు పెట్టడం పత్రికాస్వేచ్ఛను హరించడమే అవుతుంది. వార్తాపత్రికలో ప్రచురితమైన వార్తపై అభ్యంతరాలుఉంటే వివరణ అడగాలి కానీ.. ఇలా కేసులు పెట్టడం ఎంతమాత్రం సరికాదు.

– అల్లం అశోక్, టీయూడబ్ల్యూజే(143) నేషనల్ కౌన్సిల్ మెంబర్

బాధిత రైతాంగానికి బాసట


జైనథ్ మండలంలోని పూసాయికి చెందిన రైతు వీ.భూమయ్య తనకున్న 12 ఎకరాల్లో పత్తి, కంది పంటలు సాగు చేశాడు. గతనెల 16న కురిసిన వర్షానికి చేనులో ఇసుక మేటలు నిండి పంట పూర్తిగా ధ్వంసమైంది. పూర్తిగా ఇసుకతో నిండుకుని చేను అనే ఆనవాళ్లు కోల్పోయింది. ఇలాంటి పంటచేలను మళ్లీ సాగులోకి తీసుకువచ్చేలా అభివృద్ధి చేయనున్నారు.

ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామ సమీపంలోని ఈ చేనులో జక్కుల గంగన్న అనే రైతు పత్తి పంటను సాగు చేశాడు. వరద ప్రవాహానికి చేను కోతకు గురై నాలుగెకరాల్లో పత్తి పంట పూర్తిగా నష్టపోవడంతో పాటు ఇలా బండరాళ్లు మిగిలి రైతుకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఇలాంటి బండరాళ్లను తొలగించి సాగుకు యోగ్యంగా మార్చనున్నారు.



- ఇసుక మేటలు వేసిన భూముల అభివృద్ధికి నిర్ణయం
- ప్రత్యేక బృందాల నియామకం
- గుర్తింపునకు నేటి నుంచి క్షేత్రస్థాయి సర్వే

కైలాస్‌నగర్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తలెత్తిన వరద ప్రవాహానికి పంటచేలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 18 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అయితే లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలతో పాటు పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లోకి ఇసుకమేటలు చేరి పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పంటలు సాగు చేసే అవకాశం లేకుండా చేలన్నీ ఆనవాళ్లు కోల్పోయాయి. ఇలాంటి బాధిత రైతాంగానికి అధికార యంత్రాంగం అండగా నిలవాలని సంకల్పించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇసుకమేటలు వేసిన భూములను సాగుకు యోగ్యంగా మార్చాలని నిర్ణయించింది. ఇలాంటి భూముల గుర్తింపుకోసం వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టనున్నారు.

ఏడు మండలాల్లో ఇదే పరిస్థితి ...

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పలు మండలాల్లో పంట చేలు ఇసుకతో నిండిపోవడం, భూమి కోతకు గురికావడంవంటి సమస్యలు తలెత్తి అన్నదాతకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రైతుకు కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఇటీవల వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. ఆదిలాబాద్ రూరల్, భోరజ్, జైనథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, నేరడిగొండ మండలాల్లోని పంట చేలల్లో ఇసుకమేటలు ఏర్పడి భూములు సాగుకు పనికిరాకుండా పోయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. రైతులకు కలిగిన నష్టాన్ని నివారించేందుకు ఇలాంటి భూములను మళ్లీ సాగుకు అనుకూలంగా అభివృద్ధి చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది.

నేటి నుంచి క్షేత్రస్థాయిలో సర్వే ...

సాగుకు పనికిరాకుండా పోయిన వ్యవసాయభూములను తిరిగి సాగుకు యోగ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆయా మండలాల్లోని ఇలాంటి భూముల గుర్తింపుకోసం శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ప్రత్యేక సర్వే చేపట్టనున్నారు. మండల వ్యవసాయాధికారి, ఎంపీడీవో, ఏపీవో, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్ వంటి ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం ఆయా మండలాల్లోని నష్టపోయిన రైతుల పంటచేలను పరిశీలించనుంది. ఏడు మండలాల్లో ఏడు టీంలు బాధిత రైతుల పంటలను సందర్శించి పంట చేను పరిమాణాన్ని (ప్రీ మెజర్‌మెంట్) అంచనా వేయనుంది. ఎన్ని ఎకరాల్లో ధ్వంసమైంది, దాని అభివృద్ధికి ఎంత వ్యయం అవుతుంది, ఏ విధంగా అభివృద్ధి చేయాలనే వివరాలతో పాటు బాధిత రైతు వివరాలను తీసుకుంటారు. అనంతరం ఆ భూమి అభివృద్ధికి అనుసరించాల్సిన చర్యలపై పంచాయతీ సెక్రెటరీ నిర్ధారిస్తూ ప్రత్యేక ప్రొఫార్మాను సిద్ధం చేస్తారు. దాని ఆధారంగా టెక్నికల్ అసిస్టెంట్ అంచనా సిద్ధం చేస్తారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం ద్వారా నిర్దేశించబడిన విధంగా లబ్ధిదారుల వారీగా ప్రతిపాదిత పనులను సంబంధిత గ్రామసభలలో ఆమోదిస్తారు. తద్వారా ఆ భూములను సాగుకు యోగ్యంగా అభివృద్ధి చేయనున్నారు.

భరోసా కల్పించేలా..

గత నెలలో సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న భూములను సాగుకు యోగ్యంగా మార్చనున్నాం. ఇసుక మేటలు వేసిన భూముల్లోని ఇసుక తొలగింపు, నేలను చదును చేయడం, దెబ్బతిన్న ఆకృతిని సరిచేయడం వంటి పనులు చేపడుతాం. బాధిత రైతులు, భూ వివరాలు, సర్వే నంబర్లు సేకరించాం. ఐదుగురు అధికారులతో కూడిన కమిటీ వాటిని సంయుక్తంగా పరిశీలిస్తుంది. వచ్చే ఖరీఫ్ నాటికి రైతులు అందులో గతం మాదిరి పంటలు సాగు చేసేలా వాటిని అభివృద్ధిచేసి రైతుకు అండగా నిలుస్తాం.

– రాథోడ్ రవీందర్, డీఆర్‌డీవో, ఆదిలాబాద్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

బోథ్: ప్రజాపాలన ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రూ.4.15 కోట్లతో నిర్మించిన వసతి గృహాన్ని ఎంపీ నగేష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని పరిచయ ఫంక్షన్ హాల్‌లో వివిధ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని, పొచ్చెర క్రాస్‌రోడ్డు నుంచి బోథ్ వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయాలని, కుంటాల, పొచ్చెర, గాయత్రి, కనకాయి జలపాతాలను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. మంత్రి మాట్లాడుతూ సమస్యలపై తాను హామీలు ఇవ్వలేనని.. ప్రయత్నం మాత్రం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శ్యామలాదేవి, సలోని చాబ్రా, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆర్డీవో స్రవంతి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం

సాత్నాల: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. భోరజ్ మండలం పిప్పర్‌వాడలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ విఠల్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, డీసీసీబీ చైర్మన్ అడ్డీ భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ మంత్రులు వేణుగోపాలాచారి, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతాంగానికి న్యాయం చేస్తా

కైలాస్‌నగర్: భారీ వర్షాలతో పంట నష్టపోయిన బాధిత రైతాంగానికి నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో వరద నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 12,775 మంది రైతులకు సంబంధించి 17,490 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రోడ్లు, వంతెనల మరమ్మతులు, కొత్త వాటి నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఏ–సెక్షన్ బాల్కనీ కూలిపోవడంపై ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ విచారం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌కు చేరుకుని కూలిన భవనాన్ని పరిశీలించారు. ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసమయంలో ఉద్యోగులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. భవనం శిథిలావస్థకు చేరడం, నూతన కలెక్టరేట్‌కు నిధులు మంజూరుచేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఉందన్నారు.


పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

దేశభక్తిని పెంపొందించే వేదిక ఎన్‌సీసీ

ఆదిలాబాద్: ఎన్‌సీసీ యువతలో దేశభక్తిని పెంపొందించే వేదిక అని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విక్రమ్ ప్రతాప్‌సింగ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో 32 తెలంగాణ బెటాలియన్ 3వ వార్షిక శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. డిప్యూటీ లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కుమార్ కిచ్చార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రతిరోజు పీటీ, డ్రిల్, ఫైరింగ్, ఆప్టికల్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు లెఫ్టినెంట్ గాలి అశోక్, లెఫ్టినెంట్ రజిత, లెఫ్టినెంట్ పుట్ట లక్ష్మణ్, లెఫ్టినెంట్ బెల్లం భూమన్న, మధు రావు, రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వీపీసింగ్

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లతో అధికారులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అటవీశాఖ రేంజ్ పులిమడుగు సెక్షన్ పరిధి డొంగర్‌గాం గ్రామ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో పెట్రోలింగ్ నిర్వహించగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఇచ్చోడ రేంజ్‌కు తరలించినట్లు పులిమడుగు సెక్షన్ అధికారి చంద్రారెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆలయంలో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీస్‌సిబ్బంది

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో నర్సింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం చుట్టూ ఎలాంటి రక్షణగోడ లేకపోవడాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు.. స్వామివారి విగ్రహంపై ఉన్న వెండినామాలు, ఇతర సామగ్రి, హుండీని పగులగొట్టి ఎత్తుకెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కాగా, పట్టణంలోని గాంధీనగర్ శివారులో నల్లపోచమ్మ ఆలయం వద్ద ఓ దొంగ చోరీకి యత్నిస్తున్న విషయమై సీసీ ఫుటేజీ పరిశీలించిన అర్చకులు ఈశ్వర్, ఆలయకమిటీ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. కాగా, ఆ వ్యక్తిని పోలీసులు పట్టుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

గల్లంతైన వివాహిత మృతదేహం లభ్యం

దండేపల్లి: ఈనెల 9న దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వంతెన పై నుంచి దూకి కుమురం భీం జిల్లా తిర్యాణి మండలం తలండి గ్రామానికి చెందిన వివాహిత పోలోజు శృతి(42) గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో ఆమె ఆచూకీ కోసం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద గురువారం శృతి మృతదేహం లభ్యమైందని ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. ఈమేరకు భర్త వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి సమీపంలోని గోదావరి నదిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన నరకట్ల రాజేశ్(23) ఈనెల 6న గణేశ్ నిమజ్జనం రోజున బ్రిడ్జి వద్ద నిద్రమత్తులో ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడిపోయాడు. బుధవారం సాయంత్రం సోమనపల్లి గోదావరి నదిలో లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద మృతదేహం లభ్యం కాగా, నరకట్ల రాజేశ్‌గా గుర్తించినట్లు చెన్నూర్ ఎస్సై శ్యామ్‌పటేల్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

పెంబి: మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామ పరిధిలోని కోలాం గూడకు చెందిన రైతు టేకం భీంరావు కాడెద్దు బుధవారం పిడుగుపాటుకు మృతిచెందింది. రోజులాగే మేతకు వెళ్లిన రెండు ఎడ్లు ఒకటి ఇంటికి వచ్చింది. మరొటి రాకపోవడంతో గురువారం వెతకగా గ్రామ సమీపంలోని చేనులో మృతి చెంది ఉంది. పిడుగుపాటుకు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

యువతి అదృశ్యం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బెస్తకాలనీకి చెందిన గాజిరెడ్డి సంధారాణి (19) అదృశ్యమైనట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. బుధవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. యువతి సోదరుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

తిర్యాణి: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రెండు కలప దుంగలను పట్టుకున్నట్లు గిన్నెదరి రేంజ్ అధికారి సరోజనిదేవి తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని చింతలమాదర నుంచి సిడాం శంకర్ గురువారం ఆటోలో రెండు కలప దుంగలను ఆసిఫాబాద్ వైపు తరలిస్తున్నాడు. అటవీ సిబ్బంది ఆపగా అగకుండా వెళ్లిపోయాడు. ఆటోను వెంబడించి ఉల్లిపిట్ట శివారులో పట్టుకున్నారు. కాగా కలప దుంగల విలువ రూ.12 వేలు ఉంటుందని, ఈమేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ఆటకట్టు

- నిషేధం విధించిన కేంద్రం
- ఆడితే జైలు.. జరిమానా
- ఉమ్మడి జిల్లాలోనూ బాధితులు
- గేమింగ్ యాప్‌లు ఓపెన్ కాక ఆటగాళ్ల ఆగమాగం



మంచిర్యాలక్రైం: ఆకర్షించి.. అప్పుల పాలు చేసి ఆర్థికంగా దివాలా తీయిస్తున్న ఆన్‌లైన్ ఆటలకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు–2025' తీసుకొచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల ఉచ్చులో పడి బాలలు, యువత, మధ్య వయస్కుల వరకు ఎంతోమంది జీవితాలను అంధకారం చేసుకున్నారు. కొందరు ఆత్మహత్యకూ పాల్పడ్డారు. మరికొందరు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలయ్యారు. రమ్మీ, సట్టా, ఫోకర్, కార్డ్‌గేమ్స్‌తోపాటు ఆన్‌లైన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్, ఆన్‌లైన్ లాటరీ ఇలా డబ్బులు పెట్టి ఆన్‌లైన్‌లో ఆడే ఆటలు యువత జీవితాలను నట్టేట ముంచాయి. ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్‌కు బానిస కావడం వల్ల పలు కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యాయి. ఇకపై ఆన్‌లైన్ గేమ్‌లు నిర్వహిస్తే మూడేళ్ల వరకు జైలు లేదా రూ.కోటి జరిమానా విధిస్తారు. కొన్నిసార్లు రెండు శిక్షలు విధిస్తారు. గేమ్‌లపై ప్రచారం చేసినా రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ.50లక్షల జరిమానా విధిస్తారు. కొన్నిసార్లు రెండూ విధించవచ్చు.

పోగొట్టుకున్న డబ్బు సంపాదించాలని

ఇటీవల చెన్నూర్‌లోని బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేసే రవీందర్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్నాడు. ఎలాగైనా ఆ డబ్బు సంపాదించాలని బ్యాంకుకే టోకరా వేశాడు. బ్యాంకులో పనిచేసే కొందరితోపాటు తనకు తెలిసిన మరికొందరి సహకారంతో బ్యాంకులో ప్రజలు తాకట్టుపెట్టిన 25.17 కిలోల బంగారునగలు, రూ.1.10 కోట్ల నగదు గోల్‌మాల్ చేశాడు. బయటపడడంతో ముగ్గురు ఉద్యోగులు కటకటాల పాలయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి



అక్రమ ఆర్థిక లావాదేవీలు, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ గేమింగ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం, నిర్వహించడం చట్టరీత్యా నేరం. నిర్వహించినా, ఆడినా, ప్రచారం చేసినా కఠిన చర్యలు ఉంటాయి. పిల్లలు ఏం చేస్తున్నారు.. ఏ ఆటలు ఆడుతున్నారనేది తల్లిదండ్రులు గమనించాలి. ఎక్కడైనా నిషేధిత బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిస్తే నేరుగా పోలీసు అధికారులకు సమాచారం అందించాలి. వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

ఆటగాళ్లు ఆగమాగం

ఆన్‌లైన్ గేమ్స్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో ఆటలకు బానిసగా మారిన వాళ్లు ఆగమాగం అవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతంలో అధికంగా యువత మొదలుకుని ఉన్నత స్థాయిలో ఉన్న వారు సైతం ఆన్‌లైన్‌లో రమ్మీ, క్రికెట్ బెట్టింగ్, మనీగేమింగ్‌లకు బానిసైన వారు ఉన్నారు. మద్యం సేవిస్తూ ఆటలు ఆడుతూ కాలం గడిపేవారు. ప్రస్తుతం గేమింగ్ యాప్‌లు ఓపెన్ కాకపోవడంతో మతిస్థిమితం తప్పినట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పిచ్చిలేస్తుందని, మైండ్ పని చేయడం లేదంటూ యువత వింతగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసింది. మరికొందరు పేకాట వైపు వెళ్తున్నట్లు సమాచారం. శ్రీరాంపూర్‌కు చెందిన ఓ సింగరేణి ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి ఆన్‌లైన్ ద్వారా ఒక్క రోజులోనే 28 సార్లు బదిలీలు జరిగాయి. దీంతో బ్యాంకు అధికారులు ఖాతాను నిలిపి వేసి పిలిపించారు. ఇలా బ్యాంకు అధికారులు సైతం అధికంగా ఆన్‌లైన్‌లో పలుమార్లు డబ్బు బదిలీ జరిగే ఖాతాలపై దృష్టి సారించినట్లు సమాచారం.

కుటుంబం బలి

మంచిర్యాలలోని రెడ్డికాలనీకి చెందిన ఇప్ప వెంకటేష్(40) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ కుటుంబంతో జీవనం సాగించేవాడు. 2024 సెప్టెంబర్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై రూ.25లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు లోన్ యాప్‌ల ద్వారా రుణం తీసుకున్నాడు. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక భార్య వర్షిణి(33), ఇద్దరు కుమారులు రిషికాంత్(11), విహాంత్(3)లను హత్య చేసి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.

ఎస్బీఐ–2లో బంగారు ఆభరణాలు రికవరీ

- బ్యాంక్‌కు చేరిన నగలు
- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్



వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ–2 బ్రాంచిలో జరిగిన భారీ కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. చోరీకి గురైన బంగారు ఆభరణాలను పోలీసులు పూర్తిగా రికవరీ చేయడంతో కథ ముగిసింది. బంగారం బ్యాంక్‌కు చేరడంతో ఆందోళనకు గురైన బాధితులకు ఊరటనిచ్చింది. గురువారం జైపూర్ ఏసీపీ కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఈమేరకు వివరాలు వెల్లడించారు. చెన్నూర్ ఎస్బీఐ–2 బ్రాంచిలో గత నెల 23న క్యాషియర్‌గా పని చేస్తున్న నరిగే రవీందర్‌తోపాటు మరికొందరు 20.250 కిలోల బంగారు ఆభరణాలు మాయం చేశారని రీజినల్ మేనేజర్ రితేశ్‌కుమార్ గుప్తా ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు గతనెల 31న ప్రధాన నిందితుడి, 44 మందిపై కేసు నమోదు చేసి 15.237 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు రామగుండం సీపీ అంబర్‌కిశోర్ ఝూ వెల్లడించారు. ఏ–1 నరిగే రవీందర్, ఏ4, కొంగండి బీరేశ్, ఏ5 కోదాటి రాజశేఖర్‌ను కస్టడీకి తీసుకుని విచారించాం. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ మంచిర్యాల, ముత్తూట్ ఫిన్‌క్రాప్ మంచిర్యాల, చెన్నూర్, మణప్పురం మంచిర్యాలలోని రెండు బ్రాంచ్‌ల తోపాటు ముత్తూట్ మనీ బ్రాంచ్ చెన్నూర్‌లలో 5.250 కిలోల బంగారు నగలను రికవరీ చేశాం. గతంలో చేసినని, గురువారం రికవరీ చేసిన బంగారం పూర్తిస్థాయిలో 20.250 కిలోల నగలను రికవరీ చేశామని తెలిపారు. ఈ గోల్డ్‌ను కోర్టు డిపాజిట్ చేస్తుందని డీసీపీ తెలిపారు. త్వరలో బ్యాంక్ అధికారులు బాధితులకు అప్పగిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్, శ్రీరాంపూర్ సీఐలు దేవేందర్‌రావు, వేణుచందర్, ఎస్సైలు శ్వేత, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు అభినందన

చెన్నూర్ ఎస్బీఐ–2 బ్రాంచిలో మాయమైన బంగారు నగలను 21 రోజుల్లో ఛేదించిన పోలీసులను సీపీ అంబర్ కిశోర్‌ఝూ అభినందించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐలు దేవేందర్‌రావు, బన్సీలాల్, వేణుచందర్, బాబురావు, ఎస్సైలు సుబ్బారావు, శ్రీధర్, రాజేందర్, శ్వేత, సంతోశ్, లక్ష్మీప్రసన్న, కోటేశ్వర్, మధుసూదన్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు రవి, రమేశ్, ప్రతాప్, తిరుపతి లింగమూర్తిలకు అభినందనలు తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి



యాచకుడి మృతదేహం

సారంగాపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గుర్తుతెలియని 65 ఏళ్ల యాచకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. కొన్నిరోజులుగా బస్టాండ్ పరిసరాల్లో యాచకుడు యాచిస్తూ కడుపు నింపుకొనేవాడు. అక్కడే నిద్రిస్తూ, భోజనం చేసేవాడు. ఈక్రమంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి పేరు, ఏగ్రామం అనే వివరాలు తెలియరాలేదని, అతని గురించి సమాచారం తెలిస్తే 8712659516 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

జ్వరంతో చిన్నారి..



అనిరుధ్ (ఫైల్)

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నారి జ్వరంతో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. దండేపల్లి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన బొడ్డు రమ్య–రాజేందర్ దంపతులు. వీరికి అనిరుధ్(5), మూడేళ్ల పాప సంతానం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అనిరుధ్‌కు మూడు రోజుల క్రితం తీవ్ర జ్వరం రాగా, లక్సెట్టిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి తిరిగి ఇంటికి వెళ్లారు. బుధవారం రాత్రి తీవ్ర జ్వరంతో విరేచనాలు కాగా గురువారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యం అందిస్తున్న కొద్దిసేపటికే మృతి చెందాడు. ఆడుతూ పాడుతూ ఉన్న తమ కుమారుడు జ్వరంబారిన పడి మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

తాండూర్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. తాండూర్ మండలం రేచిని రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఈ ఘటన చోటు చేసుకుంది. బెల్లంపల్లి రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ కథనం ప్రకారం.. రైల్వే ట్రాక్ సమీపంలో గురువారం ఉదయం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. సుమారు 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి బల్లార్ష నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. మూడు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిస్తే 9948481902, 8712658596, 8712658605 నంబర్లలో సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

బజార్‌హత్నూర్: అనారోగ్యంతో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన జడల బక్కయ్య(62) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోయిన తర్వాత ఇంటి రేకుల షెడ్డులో తాడుతో ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబీకులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

ముథోల్: మండలంలోని పిప్రి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన ఆర్.హనుమంతు(44) భార్యతో గొడవపడి సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అతని ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. గురువారం పిప్రి శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. పశువుల కాపరి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తమ్ముడు గంగారాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

భీంపూర్: గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పీర్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన బక్కివార్ పురుషోత్తం తన చేనులో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నాడని తమకు సమాచారం అందింది. పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం దాడి నిర్వహించారు. పత్తి పంటలో 42 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు.

స్నేహితుల సన్మాన పండుగ



స్వీట్లు తినిపించుకుంటున్న మిత్రులు

లక్ష్మణచాంద: మహిళలకు తామేమి తక్కువ కాదన్నట్లుగా మగవాళ్లు కూడా ఈ మధ్యన స్నేహితుల సన్మానం పండుగ జరుపుకుంటున్నారు. మండలంలోని కనకాపూర్‌కు చెందిన 24 మంది యువకులు ఇటీవల జరుపుకోగా గురువారం పీచర గ్రామానికి చెందిన 14 మంది యువకులు వ్యవసాయ క్షేత్రంలో శాలువాలతో ఒకరినొకరు సన్మానించుకుని స్వీట్లు తినిపించుకున్నారు. తమ స్నేహం ఇలాగే కొనసాగాలని కోరుకున్నారు.

డమ్మీ తుపాకీతో హల్‌చల్ చేసినవారిపై కేసు

నిర్మల్‌టౌన్: పట్టణంలో ఈనెల 7న జరిగిన గణేశ్ నిమజ్జనం సందర్భంగా డమ్మీ తుపాకీ పట్టుకుని డ్యాన్స్ చేసి హల్‌చల్ చేసినవారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..స్థానిక నాయుడువాడలో భాగ్యనగర్ కాలనీకి చెందిన భక్తాంజనేయ గణేశ్‌మండలి విగ్రహం ముందు రంజిత్‌తోపాటు మరికొందరు డమ్మీ తుపాకీ పట్టుకుని డ్యాన్స్ చేస్తూ.. ప్రజలను రెచ్చగొట్టేలా ప్రవర్తించారు. చుట్టుపక్కల ఉన్నవారిని, నిమజ్జన శోభాయాత్రలో భక్తులను భయభ్రాంతులకు గురిచేశారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఆపాలని చెప్పిన వినకుండా వారి విధులకు ఆటంకం కలిగిస్తూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పీడీ నామ్‌దేవ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తలమడుగు: హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో ఈనెల 9, 10వ తేదీల్లో 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ ఎంపిక పోటీల్లో సుంకిడి ఉన్నత పాఠశాల పీడీ జి.నాందేవ్ సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపిక య్యారు. ఈ పోటీలు నవంబర్‌లో జరగనున్నాయి. హెచ్‌ఎం జైవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్ స్వామి, బి.గజానంద్, వై.రామ్‌రెడ్డి, పి.సుకుమార్, జి.సుజాత, సి.శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి గురువారం ఆయన్ను అభినందించి సన్మానించారు.

రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో, ఎస్సై, తహసీల్దార్

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ సమీపంలో రైస్‌మిల్లులో తహసీల్దార్ రహీముద్దీన్, ఎస్సై కమలాకర్ గురువారం అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పక్కా సమాచారంతో మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఎస్వో, సెక్టోరియల్ అధికారిని సస్పెండ్ చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘాల నాయకుల డిమాండ్



ఆందోళన చేస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

నార్నూర్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ నాసిరకం సరుకులు వాడుతూ అన్నంలో పురుగులు వస్తున్నా పట్టించుకోని నార్నూర్ కేజీబీవీ ప్రత్యేక అధికారి హిమబిందు, జిల్లా సెక్టోరియల్ (జీసీడీవో) అధికారి ఉదయశ్రీలను సస్పెండ్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాల ప్రధాన గేటు ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం పులిహోరలో పురుగులు రావడంతో విద్యార్థులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వారితో మాట్లాడటానికి వెళ్లిన ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులను అనుమతి లేదని ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంపై మండిపడ్డారు. ఎస్సై అఖిల్‌తో వాగ్వాదానికి దిగారు. ఆదివాసీ గిరిజన విద్యార్థినులకు అన్యాయం జరిగితే ప్రశ్నించవద్దా? అంటూ నిలదీశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు మాట్లాడుతూ ఎస్వో, జిల్లా సెక్టోరియల్ అధికారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆందోళన చేసిన విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులను బెదిరిస్తున్నారని తెలిపారు. గతంలో ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ అయితే హిమబిందును ఏడాదిపాటు విధుల నుంచి తొలగించారని, పనిష్మెంట్‌పై నార్నూర్ పంపిస్తే ఇక్కడ అదే ధోరణి అవలంబిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్, రాజ్ గోండు సేవా సమితి మండల అధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి అర్క గోవింద్ ఉన్నారు.

సొంతింటిపై అభిప్రాయ సేకరణ



బ్యాలెట్‌తో అభిప్రాయాన్ని తెలుపుతున్న కార్మికులు

శ్రీరాంపూర్: కార్మికులకు సొంతిల్లు కావాలా..? కంపెనీ క్వార్టర్ కావాలా..? అనే అంశంపై సీబీటీయూ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ చేపట్టారు. కంపెనీ వ్యాప్తంగా రెండు రోజులపాటు చేపడుతున్న కార్యక్రమంలో తొలిరోజు గురువారం భూగర్భ గనుల్లో బ్యాలెట్ పద్ధతిలో అభిప్రాయ సేకరణ చేపట్టారు. శ్రీరాంపూర్‌లోని భూగర్భ గనులపై ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనిపై జరిగిన కార్యక్రమానికి ఆ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్మికులు ఈ అంశంపై బ్యాలెట్ పేపర్‌పై టిక్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు. మీడియా సమక్షంలో లెక్కించి దాని ఆధారంగా యజమాన్యానికి రిపోర్ట్ ఇస్తామని తెలిపారు. యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ శ్రీనివాస్, సాయిల శ్రీనివాస్, తిరుపతి, బానేష్, శ్రీధర్, తోడే సుధాకర్, నవీన్, పెరిక సదానందం తదితరులు పాల్గొన్నారు.

'మత్తడివాగు' రెండు గేట్ల ఎత్తివేత



దిగువకు వెళ్తున్న వరదనీరు

మండలంలోని వడ్డాడి సమీపంలో గల మత్తడివాగు ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు ప్రాజెక్టులోకి చేరుతుంది. ఇన్‌ఫ్లో ద్వారా 1290 క్యూసెక్కుల నీటిని రెండు గేట్లను ఎత్తి 3567 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలినట్లు ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు. పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా ప్రస్తుతం 277.40 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. భారీవర్షాల నేపథ్యంలో మరిన్ని గేట్లు ఎత్తి నీటిని వదిలే అవకాశం ఉన్నందున దిగువ ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. – తాంసి

బ్రిడ్జి పైనుంచి దూకుతానని హైడ్రామా

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి టీచర్స్ కాలనీ సమీపంలోని జాతీయ రహదారి బ్రిడ్జిపై నుంచి దూకుతానంటూ ఒకరు హైడ్రామా సృష్టించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కన్నెపల్లి మండలం కుర్మగూడెంకు చెందిన గోసుల దామోదర్‌కు భార్యతో కొన్ని రోజులు గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె రామరావుపేటలోని తన తల్లిగారింటికి వెళ్లి ఉంటుంది. ఇదే సమయంలో తన గ్రామంలో ఓ భూ సమస్య రావడం, మరోపక్క కుటుంబ సమస్యలతో కొన్నిరోజులుగా మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. గురువారం ఆయన ఇంటి నుంచి సాయంత్రం ఇక్కడికి వచ్చి బ్రిడ్జిపై కిందికి దూకుతానంటూ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. దీంతో వారు పోలీసులకు తెలపడంతో ఎస్సై ఉపేందర్‌రావు ఘటన స్థలానికి చేరుకుని వారించారు. సమస్య ఏమిటని అడగితే ఏం చెప్పకుండా ఉన్నాడు. పోలీసులు చాకచక్యంగా అతన్ని వెనుక నుంచి పట్టుకుని కాపాడారు. చివరికి కౌన్సెలింగ్ అనంతరం అతని అత్తగారిల్లు రామరావుపేటలో దింపేసి వచ్చినట్లు ఎస్సై తెలిపారు.

అడవిపంది దాడిలో మహిళకు తీవ్రగాయాలు



చికిత్స తీసుకుంటున్న మధునక్క

కోటపల్లి: అడవిపంది దాడిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని వెంచపల్లిలో బొల్లవేన మధునక్క ఇంటి సమీపంలోని స్థలంలో మొక్కజొన్న పంట వేసింది. గురువారం తెల్లవారుజామునే అడవి పందిని తరిమివేస్తుండగా వేగంగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతున్న మధునక్కను ఫారెస్టు అధికారులు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అడవిపంది మృతిచెందిందని తెలుసుకున్న అధికారులు పంచనామా నిర్వహించి ఖననం చేశారు. మధునక్కను గాయపర్చిన పంది అడవిపందినే అని గ్రామస్తులు తెలుపగా ఊర పంది అని ఫారెస్టు అధికారులు తెలపడం గమనార్హం. ఈ విషయమై ఫారెస్టు రేంజర్ సదానందంను వివరణ కోరగా గాయపర్చిన పంది ఊరపంది అని తెలిపారు. పూర్తి వివరాలు త్వరలోనే తెలుస్తాయని చెప్పడం గమనార్హం.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడ రైల్వే ఏ క్యాబిన్ సమీపంలో ఓ ఇంట్లో బెజ్జాల సత్యవతి(55), ఆమె మనవరాలు గీత శిరీష(4) అనుమానాస్పద మృతిపై కోడలు సృజన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రం 3టౌన్‌కు చెందిన బెజ్జాల చంద్రశేఖర్, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు గంగోత్రి, ఉండగా.. చిన్నకుమారుడు వెంకటేశ్ ట్రాన్స్‌జెండర్(శిరీష)గా మారి మంచిర్యాలలో స్థిరపడింది. గోపాలవాడ శివారులో రైల్వే ఏ క్యాబిన్ వద్ద ఇంటికి సత్యవతి, కుమారుడు గంగోత్రి, మనవరాలితో అప్పుడప్పుడు ఇక్కడకు వచ్చేవారు. ఆ సమయంలో స్థానికంగా ఉంటున్న ఓ ఆర్‌ఎంపీతో సత్యవతికి పరిచయం ఏర్పడింది. కాగా, ఆ ఇంటిని విక్రయించాలని సత్యవతి స్థానిక ఆర్‌ఎంపీకి చెప్పగా, కొన్ని మరమ్మతు చేయాలని సూచించాడు. అందుకు రూ.50 వేల అప్పు ఇవ్వడం, ఈవిషయం బయటకు రాగా, వీరి గొడవ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. ఇంటిని విక్రయించేందుకు ఆర్‌ఎంపీ తరచూ సత్యవతికి ఫోన్లు చేస్తుండేవాడు. ఈనెల 8న గంగోత్రి తన తల్లి సత్యవతి, కూతురు గీతశిరీషతో కలిసి ట్రాన్స్‌జెండర్ శిరీష ఇల్లు విక్రయించడానికి మంచిర్యాలకు వచ్చారు.

ఆర్‌ఎంపీ, కుమారుడిపై అనుమానాలు!

సత్యవతి, గీత శిరీష మృతికి స్థానికంగా ఉన్న ఓ ఆర్‌ఎంపీ, తమ కుమారుడు గంగోత్రిపై మృతురాలి సత్యవతి భర్త చంద్రశేఖర్ అనుమానం వ్యక్తం చేశాడు. సత్యవతితో ఆర్‌ఎంపీ గతంలో అసభ్యంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. తాను మందలించానని, దాంతో తాను మంచిర్యాలకు వస్తే చంపేస్తానని బెదిరించినట్లు తెలిపాడు. తన భార్య, మనవరాలిని ఆర్‌ఎంపీ హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశాడు.

విద్యుత్ ప్రమాదంలో యువకుడికి గాయాలు

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన ముస్తఫా అనే యువకుడు గురువారం విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తఫా గత ఆరు నెలల క్రితం కుటుంబంతో కలిసి ఇతర గ్రామానికి వలసవెళ్లాడు. ఈనేపథ్యంలో తన ఇంటి కరెంటు బిల్లు చెల్లించలేదు. బకాయిపై నెల క్రితం విద్యుత్‌సిబ్బంది కనెక్షన్ తొలగించారు. తాజాగా గ్రామానికి వచ్చిన ముస్తఫా తన ఇంటికి కరెంటు కనెక్షన్ పునరుద్ధరించాలంటూ సిబ్బందిని కోరాడు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే పునరుద్ధరిస్తామని వారు బదులివ్వడంతో తానే స్వయంగా స్లాబుపైకి ఎక్కి విద్యుత్ తీగలను లాగాడు. అనంతరం కిందకు చేరుకుని కరెంటు వైరును తాకగానే షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.